

అన్ని విధాలుగా రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించిందని మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగన్‌దేనని అన్నారు. మళ్లీ జగన్‌ను సిఎంగా చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, వైస్ చైర్మన్ పి.మహేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాకినీడు బాబు, కళ్లేపల్లి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి

కూలీలకు 'ఉపాధి' కరువు

- అరకొర పనులే దిక్కు
- అల్లాడుతున్న వ్యవసాయ కార్మికులు
- పస్తులతో కాలం వెళ్లదీస్తున్న కుటుంబాలు
- 8 వారాలుగా పెండింగులో వేతనాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు లేకపోవడంతో పస్తులతో కాలం గడుపుతున్నారు. వామపక్షాల ఒత్తిడితో అనేక పోరాటాల ఫలితంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలను ఆదుకునేందుకు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేస్తోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరి కారణంగా ప్రస్తుతం ఉపాధి కూలీలకు పనులు లేకుండా పోయాయి. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది జనవరిలో సుమారు 1.10 లక్షల మందికి పనులు చూపించాలని అధికారులు నిర్దేశించుకోగా వివిధ కారణాలతో ఇప్పటి వరకు కేవలం 3.97 శాతం అంటే 4,371 మందికి మాత్రమే పనులు కల్పించారు. ఒకపక్క వ్యవసాయ పనులు లేక మరోవైపు ఉపాధి పనులు కల్పించక వ్యవసాయ కార్మికులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 368 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 3.42 లక్షల జాబ్ కార్డులు జారీ చేయగా 5.96 లక్షల మంది కూలీలు నమోదయి ఉన్నారు. వీరిలో 4, 59, 414 వేతనదారులు రెగ్యులర్‌గా పనులకు వెళుతున్నారు. ఉపాధి పథకం అమలు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాల వలన ప్రస్తుతం అరకొర పనులే జరుగుతున్నాయి. ఎన్నో లక్షల కుటుంబాలను ఆదుకుంటున్న ఈ పథకానికి కేంద్రం బడ్జెట్లో నిధులను ఏటా తగ్గిస్తూ వస్తుంది. దాంతో 100 రోజులు పని దినాల కల్పన సాధ్యం కావడం లేదు.

అరకొర పనుల కల్పన

జిల్లాలో లక్షలాదిమంది కూలీలు ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏ రోజుకి ఆ రోజు పనికి వెళ్లితే పోషణ జరిగే కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుత వ్యవసాయ పనులు ఉంటాయన్న కారణంతో ఉపాధిహామీ అధికారులు పథకం పనులు చెప్పడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి వ్యవసాయ పనులు ఎక్కడా దొరకడం లేదు. రబీ నాట్లు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. చాలామంది రైతులు ఎడజల్లు సాగు పద్ధతిని అనుసరించారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఎడజల్లు సాగుపైనే ఎక్కువగా అవగాహన కల్పించారు. దాంతో జిల్లావ్యాప్తంగా ఉన్న కూలీలకు పట్టుమని పదిమందికి కూడా పని చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఆదుకుంటాయనుకున్న ప్రభుత్వాల తీరుతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు ఈ నెలలో 2285 పనులు ద్వారా 1.10 లక్షల మందికి పనులు కల్పించాలని అధికారులు లక్ష్యంగా తీసుకున్నారు. అయితే కేవలం 3.97 శాతం పనులు మాత్రమే కల్పించారు. శంఖవరం మండలంలో 14 పంచాయతీలు ఉండగా 4757 మందికి పనులు కల్పించాలని నిర్దేశించగా కేవలం 29 మందికి మాత్రమే ఇప్పటి వరకు పనులు కల్పించిన పరిస్థితి నెలకొంది. ఒక శాతం కూడా మించలేదు. తొండంగి మండలంలో 19 పంచాయతీల్లో 5005 మందికి పనులు కల్పించాల్సి ఉండగా కేవలం 65 మందికి మాత్రమే కల్పించారు. ఇలా అన్ని మండలాల్లోనూ దారుణంగా అరకొరగానే ఉపాధి పనులు జరుగుతున్నాయి.

నిలిచిన రూ. 4.35 కోట్లు చెల్లింపులు

జిల్లాలో 1.78 లక్షల మేన్ డేస్‌కి సంబంధించి 9 వారాల బిల్లులు పెండింగులో ఉన్నాయి. సుమారు రూ.4.35 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. రోజుకి సుమారు 4 వేల మంది మాత్రమే పని చేస్తున్నారు. సర్వర్ మార్పులు వలన ఖాతాల్లో సొమ్ములు జమ కావడం ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే పెండింగ్ వేతనాలు జమ అవుతాయని డ్వామా అధికారులు చెబుతున్నారు.



అడిగిన వారందరికీ పనులు కల్పించాలి



ప్రస్తుతం ఎక్కడా ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం లేదు. వ్యవసాయ పనులు ఉంటాయన్న వంకతో అధికారులు పనులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే అడిగిన వారందరికీ పనులు కల్పించాలి. లేకుంటే వ్యవసాయ కార్మికులతో ఆందోళన చేపడతాం.

-టేకుమూడి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం.

ఆగస్టు నెల నుంచి పనులు లేవు



గత ఏడాది ఆగస్టు నెల నుంచి పనులు సక్రమంగా ఉండడం లేదు. చేసిన పనులకు వేతనాలు అందడం లేదు. ఉపాధి హామీ పథకం పైనే మా కుటుంబమంతా ఆధారపడి జీవిస్తున్నాం. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడింది.

-సిహెచ్.వెంకటలక్ష్మి, ఉపాధి కూలీ, తాళ్ళరేవు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

అసైన్డ్ భూములపై ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

అసైన్డ్ భూముల కల్గిన లబ్ధిదారులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దడాల మాటాడుతూ రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది అసైన్మెంట్ భూముల లబ్ధిదారులకు రక్షణగా 9/77 చట్టం ఉందని, ఆ చట్టంలో కీలకమైన భూముల అమ్మకాలు, కొనుగోలు చెల్లవు అనే నిబంధనలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మార్చి, భూములు అమ్ముకోవచ్చునని ఆరు నెలల క్రితం చట్ట సవరణ చేసిందన్నారు. ప్రస్తుతం మరింత దారుణంగా ప్రభుత్వం ఏదైనా అవసరాలకు భూములు సేకరించేటప్పుడు పట్టా భూములతో సమానంగా అసైన్మెంట్ భూములకు నష్ట పరిహారం చెల్లించలేమని ఆర్డినెన్సు తీసుకువచ్చిందని వివరించారు. పట్టా భూములతో సమానంగా అసైన్మెంట్ భూములకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని 2013 భూ సేకరణ చట్టం చెబుతుందని, అలాగే సుప్రీంకోర్టు కూడా తీర్పు ఇచ్చిందని, కానీ వాటికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు రావడం అన్యాయమని అన్నారు. ఇది పూర్తిగా పేదలకు ముఖ్యంగా దళితులు, బిసిలకు వ్యతిరేకమైన చర్య అని తెలిపారు. వెంటనే ఈ ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకోవాలని, 9/77 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న భూములను పేదలకు పంచాలని, గతంలో పంచిన అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూములు తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సమస్యపై వ్యవసాయ కార్మిక సంఘాలు, దళిత సంఘాలను కలుపుకుని రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామని సుబ్బారావు హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ దళిత నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, దళిత సత్త నాయకులు బచ్చల కామేశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి యునైటెడ్ ఫోరం నాయకులు తుమ్మల నూకరాజు, ప్రముఖ న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి ఈశ్వరరావు, కె.శ్రీనివాస్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్ కుమార్, కె.సింహాచలం పాల్గొన్నారు.

నేడు ఉప్పాడలో బిసిల మహాసభ

ప్రజాశక్తి - యు కొత్తపల్లి

ఉప్పాడ గ్రామంలో శుక్రవారం జయహో బిసిల మహాసభ నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకుడు చోడిపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అధ్యక్షతన జరిగే ఈ మహాసభ శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభం అవుతుందని, ఈ మహాసభలో బిసిల హక్కులు, కులాల ప్రత్యేక గుర్తింపు, మత్స్యకారుల శ్రేయస్సు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. దీనికితోడు గత టిడిపి ప్రభుత్వంలో బిసిల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు, రుణాలు, ప్రస్తుత ప్రభుత్వంలో బిసిలకు జరుగుతున్న అన్యాయంపైనా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో బిసి సామాజికవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, టిడిపి అభిమానులు, ప్రజలు పాల్గొని తమ సూచనలు, సలహాలను ఇవ్వాలని కోరారు. బిసిల మహాసభలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం టిడిపి, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చనున్నారని తెలిపారు.

పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో తగ్గిన ఎడిషనల్ క్వాంటమ్‌ను యధావిధిగా పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను చెల్లించాలని, 11వ పిఆర్‌సి ఎరియర్స్‌ను చెల్లించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్స్

మండలంలో పర్యటించిన ముద్రగడ

ప్రజాశక్తి - రౌతులపూడి

కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం మండలంలోని ఎ.మల్లవరం, రాజవరం గ్రామాల్లో గురువారం పర్యటించారు. రాజవరం గ్రామానికి చెందిన సోమరౌతు తిరుమల వెంకన్న దొర ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ముద్రగడ ఆయనను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఎం.మల్లవరం గ్రామానికి చెందిన పల్లి సూరిబాబు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీష్ కుమార్, పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



న్యాయవాదుల దీక్షకు మద్దతు ఇస్తున్న సిపిఎం నాయకులు

న్యాయవాదుల దీక్షలకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - పిఠాపురం

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు గురువారం సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కన్వీనర్ కుంచే చిన్న మాట్లాడుతూ ప్రజల ఆస్తికి భద్రత కల్పించాలని, ప్రజల ఆస్తి హక్కు హరించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు గత 60 రోజులుగా పోరాడుతున్న ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. న్యాయవాదులు చేసే పోరాటం వారికోసం కాదని ప్రజల కోసమని తెలిపారు. ప్రభుత్వం పట్టుదలకు పోకుండా తక్షణం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరణం విశ్వనాథం, కోనేటి రాజు, కుంచె మణి, కొజ్జవర నాగేశ్వరరావు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజారావు, ఉపాధ్యక్షులు ఎస్‌ఎం.అలీ, ట్రెజరర్ బొల్లోజు రాజా, న్యాయవాదులు మనోజ్‌కుమార్, జిఎస్.భాస్కరాచార్యులు, కె.ఉమామహేష్, దల్లి శ్రీనివాస్, ఎం.సత్యవతి, వైవిఎన్.మూర్తి, జిపివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతను గుర్తించండి



కాకినాడలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్‌పి సతీష్‌కుమార్, నగర కమిషనర్ నాగ నరసింహారావు

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం జిల్లాలోని పలు మండలాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. **కాకినాడ** యువత ఓటు విలువను గుర్తించి తప్పనిసరిగా ఓటును వినియోగించుకునేలా చైతన్యవంతులు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం కాకినాడలో ఘనంగా నిర్వహించారు. తొలుత పిఆర్ కళాశాల నుంచి స్మార్ట్‌సిటీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్మార్ట్‌సిటీ మీటింగ్‌హాలులో జరిగిన ఓటర్ల దినోత్సవ సభను కలెక్టర్‌తోపాటు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎస్‌పి సతీష్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగర కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఓటుకు ఎంతో విలువ ఉందన్నారు. ఓటును పొందడంతోపాటు వినియోగించుకోవడం అత్యంత ప్రధానమని సూచించారు. జిల్లాలో 50వేల మంది యువ ఓటర్లు నమోదు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే కేవలం 26 వేల మంది మాత్రమే నమోదయ్యారన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ పౌరులంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఒక ఆయుధమన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ఆర్‌జెడి నాగమణి, డిప్యూటి కమిషనర్ కోన శ్రీనివాస్, యూనివర్సిటీ ఆఫ్ డెమొక్రసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జి.అబ్బయ్య, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఒ మానే సత్యనారాయణ, తహశీల్దార్ చిన్నయ దొర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యుబిఎ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ మరియు పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసపత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. **పిఠాపురం** స్థానిక ఆర్ఆర్‌బి హెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వి.కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులం దరూ ఓటు విలువను తెలుసుకుని ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డివి.కాశీ విశ్వనాథం, బుల్లిప్రసాద్, లెక్చరర్స్ సుందరయ్య, శ్రీదేవి, లైబ్రేరియన్ ఎండి హుసేన్ పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయ విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది విద్యార్థులు కొత్తగా ఓటును నమోదు చేసుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.వెంకట రమణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రఘునాథ్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్. డాక్టర్ మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు బి.రాంబాబు, ఐ.వీరాంజనేయులు పాల్గొన్నారు. అలాగే యల్లమిల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకతట్టు నాగజ్యోతి, టిడిపి నాయకులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో రాజనీతి ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.నానిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి శ్రీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులన అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ జోసఫ్ స్టీఫెన్, కోకన్వీనర్స్ డాక్టర్ హరిబాబు, డాక్టర్ గోపి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ శ్రీదేవి, సహాయ ఆచార్యులు మహమ్మద్ నదీమ్, డాక్టర్ హారిక, డాక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండల తహశీల్దార్ వజ్రపు జితేంద్ర అధ్యక్షతన ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన ఓటరు దినోత్సవ సభలో ఆర్‌డిఒ జె.సీతారామారావు మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం నుంచి మున్సిపల్ సెంటర్, మెయిన్ రోడ్, మరిడమ్మ గుడి వీధి, సంత మార్కెట్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. **పిఠాపురం** స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు తప్పనిసరిగా అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, యు.కొత్తపల్లి, మండల తహశీల్దార్లు పి. త్రినాథరావు, జివిఎస్.ప్రసాద్, పిఠాపురం, గొల్లప్రోలు కమిషనర్లు కృష్ణవేణి, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** స్థానిక బచ్చుఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం, ఓటు హక్కుపై సాయిరామకృష్ణ అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కును ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా వినియోగించుకుంటామని ఉపాధ్యాయులు, వార్డ్ పేరెంట్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బిఎల్ఒలు వై.భరత్, ఎం.మాధవి మాట్లాడుతూ ఓటు హక్కును పొందేందుకు ప్రతీ ఏడాది ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని అన్నారు. ఓటు వజ్రాయుధం అని, ఆ ఆయుధాన్ని ప్రతీ ఒక్క ఓటరు సద్వినయోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుబ్బల సత్తిబాబు, టీచర్లు వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, కెవివి.సత్యనారాయణ, ఎఎల్‌వి.కుమారి, తదితరులు పాల్గొన్నారు.




సామర్లకోటలో ప్రమాణస్వీకారం చేస్తునన ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెద్దాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామారావు

కార్టూ'నిజం'



16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. స్థానిక కచేరిపేటలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషాబాబ్జి అధ్యక్షతన సన్నాహక సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో అంబానీ, అదానిలకు దేశ సంపదను దోచుకుంటూ ప్రపంచ కుబేరులుగా ఎదుగుతుంటే, పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు అప్పులపాలై బలవన్మరణాలకు పాల్పడుతున్నారని అన్నారు. 10ఏళ్లలో 1లక్షా 50వేల మంది రైతాంగం వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలకు చేసుకున్నారని, రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఆత్మహత్యలు 26 శాతం పెరిగాయని, ఇందుకు మోడీ ప్రభుత్వం అను సరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని విమర్శించారు. ఈ విధానాలను ప్రశ్నించే వారిపై మోడీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ ప్రజాస్వామిక హక్కులను, రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విధానాలను నిరసిస్తూ జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే రోజున కాకినాడ భానుగుడి నుండి జరిగే మోటార్ సైకిల్ ర్యాలీలో రైతాంగ శ్రేయస్సు కోరే ప్రజాస్వామిక వాదులందరూ పాల్గొని జయప్రదం చేయాలని, ఫిబ్రవరి 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, తెలుగుదేశం అనుబంధ రైతు సంఘం నాయకులు జొన్నాడ వెంకట రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కె.అంజిబాబు, కె.వీరన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి

576 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని జి. వేమవరం పంచాయతీ పరిధిలోని జగనన్న లేఔట్‌లో 576 మంది లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఇళ్ల స్థలాలను అప్పగించారు. ఎంపిటిసి సభ్యులు యర్రంనీడి అప్పారావు అధ్యక్షతన గురు వారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంటు, ఇనుమును తక్కువ ధరకే అందించడం ద్వారా మరో రూ.1 లక్ష వరకూ మేలు జరుగుతుందని తెలిపారు. ఈనెల 27 నుంచి ప్రతి ఇంటి స్థలం లబ్ధిదారునికి సంబంధిత ఇండ్ల స్థలాల లబ్ధిదారుడుకి ఆయా సచివాలయాల ద్వారా పట్టా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని పటవల పంచాయతీలో రూ. 2 కోట్లతో నిర్మించిన వివిధ భవనాలను ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రారంభించారు. పటవల పంచాయితీ కార్యాలయంపైన రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన పై అంతస్తు సచివాలయం వన్ భవనాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల నిర్మించిన వాటర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎను ఆయా గ్రామస్తులు సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక సర్పంచ్ పి. కామేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు తణుకు వరలక్ష్మి, బూరెల వెంకటరాజు, దెయ్యాల సత్తిబాబు, మట్ట లింగమూర్తి, నీలపాల శ్రీనివాస్, పినపోతు స్వామి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

ఈ నెల 22వ తేదీన మండలంలోని చంద్రవరం గ్రామంలో జరిగిన మహిళ హత్యకు కారకుడైన నిందుతుడిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు గురియైన సింహాద్రి సుజాత (48) 15 ఏళ్ల క్రితం భర్త మృతి చెందడంతో తల్లిదండ్రుల స్వగ్రామమైన చంద్రవరంలో గత ఐదేళ్ల నుంచి నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అదే గ్రామానికి చెందిన యాదాలా చైతన్య కుమార్ పెయింటింగ్ పనుల నిమిత్తం సుజాత ఇంటికి వచ్చాడు. నాటి నుంచి ఆమెతో పరిచయడం పెంచుకుని ఎప్పటికప్పుడు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. దీంతో ఆమె తల్లీదండ్రులకు చెప్పడంతో చైతన్య కుమార్‌ను మందలించారు. దీంతో ఆమెపై పగపెంచుకున్న అతడు ఈ నెల 22వ తేదీన సుజాత ఉంటున్న ఇంటిపైకి వెళ్లి దాక్కున్నాడు. ఉదయమే బట్టలు ఆరేసేందుకు పైకి వచ్చిన సుజాతపై ఒక్కసారిగా దాడి చేసి పీకపై కత్తితో కోసి పరారయ్యాడు. హతురాలు తల్లీదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసినట్లు సిఐ ఎవి.రమణ తెలిపారు.

అర్ధరాత్రి భయపెట్టి చోరీ

ప్రజాశక్తి - శంఖవరం

శంఖవరంలో బుధవారం అర్ధరాత్రి ఒక ఇంట్లో చోరీ జరిగిందని అన్నవరం ఎస్ఐ కిషోర్ బాబు తెలిపారు. పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో పర్వత వరలక్ష్మి తన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. అయితే అర్ధరాత్రి లేచి బాత్ రూమ్‌కు వెళుతుండగా ముసుగు దరించిన వ్యక్తి గోడ దూకి తనను భయపెట్టి మెడలో ఉన్న పుస్తుల తాడు, నల్లపూసల తాడును బలవంతంగా లాక్కుని పారిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రప్పాలెం గ్రామంలో ఎస్ఐ నాగార్జున రాజు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గండికోట సత్యనారాయణకు చెందిన పాన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 43 మద్యం బాటిల్స్, అదేవిధంగా గండికోట వీర రాఘవులు షాపులో తనిఖీ చేయగా 30 మద్యం బాటిల్స్ లభించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరి నిందుతులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మద్యం కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

ఎస్ఇబి స్టేషన్ పరిదిలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు నిందుతులను అరెస్టు చేసినట్లు సిఐ కెవి.స్వామి తెలిపారు. మండలంలో ధూమంతుని గూడెం గ్రామానికి చెందిన జక్కంశెట్టి విజయలక్ష్మి అనే మహిళ వద్ద ఉన్న 10 లీటర్ల నాటు సారాను, మండల కేంద్రమైన గోపాలపురంలో ముళ్ళ శ్రీనివాసరావు అమ్మకానికి నిల్వ చేసిన 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండల కేంద్రమైన జగ్గంపేట గ్రామానికి చెందిన వ్యక్తి మన స్థాపన గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన ప్రకారం..జగంపేట గ్రామానికి చెందిన పిట్ట వీరబాబు (28) మన స్థాపనకు గురై మద్యం సేవించి తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. గత 10 రోజుల నుంచి స్నేహితులకు ఇతనికి వాగ్వాదం జరిగి మన స్థాపనకు గురై మృతి చెందినట్లు తెలిపారు. వీరబాబు తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మృతినికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

347 ఫైలేరియా కేసులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం బోధ నివారణ కేంద్రం పరిధిలో 347 ఫైలేరియా కేసులు ఉన్నాయని హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామారావు తెలిపారు. గురువారం స్థానిక రామారావు పేటలోని బోధ నివారణ కేంద్రం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసులు అనేక సంవత్సరాల క్రితం నుంచి ఉన్నాయన్నారు. కొత్తగా కేసులు నమోదు కావడం లేదన్నారు. ప్రతి నెల ఒక వెనుకబడిన ప్రాంతంలో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెలలో స్థానిక కొండయ్య పేట, యానాదుల పేటలో 348 మంది రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి ఈ వ్యాధి నిర్ధారణ కాలేదన్నారు. పెద్దాపురం బోధ నివారణ కేంద్రం పరిధిలో పెద్దాపురం, గండేపల్లి, రంగంపేట, జగ్గంపేట, ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, బిక్కవోలు మండలాలు ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కె.వీరబాబు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - రౌతులపూడి

బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని పెరికి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి ఓమి బాలాజీ అన్నారు. మండల కేంద్రంలో రౌతులపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ అధ్యక్షతన గురువారం జయహో బిసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హాయంలో బిసిల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిసిలంతా టిడిపికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పైల సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29 న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 18 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మరిన్ని విజయాలను అందుకోవాలి


విజయోత్సవ సభలో అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కోటనందూరు

ఎన్నో ఆటంకాలు, నిర్బంధాలను ఎదుర్కొని పోరాడి విజయం సాధించిన అంగన్‌వాడీలు భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ పిలుపునిచ్చారు. తుని రూరల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీల విజయోత్సవ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా దడాల పద్మ మాట్లాడుతూ 42 రోజులపాటు అంగన్‌వాడీలు చేసిన పోరాటం అనుకున్న లక్ష్యాలను సాధించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించినా, ఆఖరికి ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా అంగన్‌వాడీలు లెక్కచేయకుండా పోరాటాన్ని సాగించారని తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతీ ఒక్క అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాకు ఆమె అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోరాటంతో విజయాలు సాధించాలని అందుకు అంగన్‌వాడీలు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాస్, పద్మ, కామేశ్వరి. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు. మేరీ సమా ధానం, రమణమ్మ, శాంత్ కుమారి, లోవరత్నం. సుజాత, ఇందిరా, సుశీల, సుబ్బలక్ష్మి, లీల, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే జగన్‌కు మద్దతివ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే సిఎం జగన్‌కు మరోసారి అవ కాశం ఇవ్వాలని పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు కోరారు. మండలంలోని అచ్చం పేట శివారు బ్రహ్మానం దపురం జగనన్న లేఅవుట్లో నవర గ్రామానికి చెందిన 200 మంది లబ్ది దారులకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి సహకారంతో రెండో దశలో నవర లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సామర్లకోటలో మాదిరిగా ఇళ్ళ నిర్మాణం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మోసపూరిత హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం పలాయనం చిత్తగించే టిడిపి, జనసేన హామీలను ప్రజలు నమ్మవద్దని అన్నారు. ఇళ్ల స్థలాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, ఎంపిటిసి సభ్యులు కేశవరపు ప్రభాకర్‌రావు, మండల వైసిపి అధ్యక్షులు తాటికొండ అచ్చిరాజు, మండల డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నాటిక పరిషత్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లి(దివిలి)స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటిక పరిషత్ పోటీలు కైకాల సత్యనారాయణ కళా ప్రాంగణం, ఇందన నరసారావు కళావేదికపై గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పెద్దాపురం చేనేత సొసైటీ అధ్యక్షులు ముప్పన వీర్రాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. చంద్రమాంపల్లి సర్పంచ్ కురుమళ్ళ లోవరాజు, గోపు నారాయణ మూర్తి ప్రారంభించారు. అనంతరం లోవరాజు, నారాయణమూర్తి మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహిస్తున్న వారిని అభినందించారు. ముప్పన వీర్రాజు మాట్లాడుతూ నాటక రంగం వన్నె తగ్గిపోయిందని అనుకుంటున్న తరుణంలో విశేష ప్రేక్షకాదరణతో ఈ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

అనంతరం శార్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీకాకుళం జిల్లా బోరివంకకు చెందిన పిఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో కెకె ఎల్ స్వామి రచించిన 'కొత్త పరిమళం' నాటిక, తెలుగు కళా సమితి విశాఖపట్నంకు చెందిన చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వంలో పిటి.మాధవ్ రచన 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత?' నాటికలు ప్రదర్శించారు. ఈనాటికలు అందర్నీ ఆకట్టుకున్నాయి..అనంతరం డిఎస్‌పి లతా కుమారి చేతులమీదుగా కళాకారులకు, సంస్థలకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్.మూర్తి, గొందేశి రాజా, ఇందన బ్రహ్మానందం, రవీంద్ర, కేదారి నాగు, మంతెన సత్తిబాబు, పాలాని సత్తిబాబు, పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ వైద్యం


ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న వైసిపి నాయకుడు రఘురామ్

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం పొందవచ్చునని వైఎస్ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురామ్ అన్నారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకంలో వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచడం జరిగిందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పేదలకు మేలు చేస్తూ, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి గెలుపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గొల్లపల్లి శ్రీను, మండల సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు, టౌన్ ప్రెసిడెంట్ కాపవరపు ప్రసాద్, సచివాలయం2 కన్వీనర్ రెడ్డి భాను ప్రతాప్ పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం పథకంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహించరాదని ఎంఇఒ వివేకానంద ఆదేశించారు. గురువారం మండలంలోని కోలంక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, దీని పట్ల నిర్వాహకులు ఎటువంటి ఆలక్ష్యం చేసిన ఇబ్బందు గురవుతారని అన్నారు. నెలరోజుల క్రితం విద్యార్థులకు అందించే చెక్కీలు కాలం చెల్లిపోవడంతో తిరిగి వాటిని సరఫరదారులకు పంపించాలని ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు పాండురంగారావు, విజయ కుమారి, ఉపాధ్యాయులు పుష్పాంజలి, మహాలక్ష్మి, సిఆర్‌పి నాగజ్యోతి పాల్గొన్నారు.

ప్రతిభ విద్యార్థులకు బహుమతులు


బహుమతులను అందుకుంటున్న విద్యార్థినీ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రేవతి సైన్స్ ఫౌండేషన్- రామచంద్రపురం ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో సామర్లకోట ప్రతిభ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రోజెక్టులు ఉత్తమంగా నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. ఈ విషయాన్ని గురువారం పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వివిజి ప్రకాష్ మీడియాకు వెల్లడించారు. జూనియర్ విభాగంలో 6వ తరగతి విద్యార్థిని సిహెచ్.దేవిమనోజ, సీనియర్స్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని ఎన్.వైష్ణవిలు ప్రథమ స్థానాల్లోనూ, 7వ తరగతి విద్యార్థిని సిహెచ్.విద్యా జ్యోత్స్న ప్రత్యేక బహుమతిని, అబ్దుల్ కలాం రోల్ ప్లేలో 9వ తరగతి విద్యార్థిని బి.హేమశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, రేవతి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు. విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన సైన్స్ ఉపాధ్యాయులు వై.మంగాదేవి, విఎంఎస్.శివతేజ, ఎం. మణికంఠేశ్వరి, ఎం.శ్రీమన్నారాయణలను పాఠశాల డైరెక్టర్ ఎస్‌వివిజి.ప్రకాష్, కార్యదర్శి సుధారాణి, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి అభినందించారు.

అక్రమణలు గుర్తించి అర్హులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక జగ్గయ్య చెరువు ప్రాంతంలో ఇంటి స్థలాల ఆక్రమణలు గుర్తించి అర్హులైన పేదవారికి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర నాయకులు డి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని స్థానిక జగ్గయ్య చెరువు ప్రాంతాన్ని నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, తహశీల్దార్ పి.త్రినాధరావులను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ జగ్గయ్య చెరువు ప్రాంతంలో గతంలో అనేకమంది ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారని, రాజీవ్ గృహకల్ప సముదాయాన్ని కూడా నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బోడకొండ, నాయకులు అప్పలరాజు, శాఖ రామకృష్ణ, గణపతి పాల్గొన్నారు.

సాంబమూర్తిని పరామర్శించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం గ్రామానికి చెందిన అచ్చర్తి సాంబమూర్తిని శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు, జడ్‌పిటిసి గోల్లు లక్ష్మణమూర్తి పరామర్శించారు. సాంబమూర్తి ఇటీవల ప్రమాదానికి గురై తన స్వగృహంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వారు గురువారం ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలతోపాటు, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర్ బాబు, మాజీ జెడ్‌పిటిసి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన నానాజీ

ప్రజాశక్తి - కరప

తదేకం ఫౌండేషన్ సహకారంతో కొత్తపేట ప్రాంతంలో జనసేన నాయకులు యాళ్ల వీర వెంకట సత్యనారాయణ స్వగృహంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని జనసేన పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంతం నానాజీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శిక్షణ వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని నైపుణ్యం సంపాదించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తదేకం ఫౌండేషన్ ప్రతినిధి చావ్వకుల సందీప్, జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, పేకెటి ప్రసాద్, భవాని పవన్, పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలో జరిగిన అభివృద్ధిపై యనమల కృష్ణుడు చర్చకు సిద్ధమా అని ఎంపిపి లగుడు శ్రీనివాస్ ప్రశ్నించారు. స్థానిక సర్పంచ్ గరిసింగు శివలక్ష్మి దొరబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరుసగా 3దఫాలు మండల ప్రజలు ఛీకొట్టినా యనమల కృష్ణుడు అసత్య ఆరోపణలు మానుకోలేదని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బిటీ, సిసి రోడ్లను, డ్రయినేజీలను రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా ఎటువంటి అవినీతికి తావులేకుండా వేయడం జరిగిందని అన్నారు. సంక్షేమ పథకాలను తరతమ భేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా అందిస్తున్న ఘనత మంత్రి దాడిశెట్టి రాజాదేనని అన్నారు. డబ్బులు ఇచ్చి ప్రజల ను కొనుగోలు చేసే టిడిపి కందువాలను కప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మీ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి, మా ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజి, కన్వీనర్ చింతకాయల చినబాబు, గొర్ల రామచంద్రరావు , ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర, వేముల రాజబాబు, తదితరులు పాల్గొన్నారు

సెక్యులర్ పదాన్ని తొలగిస్తే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - కాకినాడ

భారత రాజ్యాంగంలోని సెక్యులర్ పదాన్ని తొలగిస్తే ఉద్యమిస్తామని ఆల్ ఇండియా ప్రేయర్ అండ్ అప్పిల్ జాతీయ అధ్యక్షులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ దొమ్మేటి సుధాకర్ అన్నారు. స్థానిక గొడారిగుంటలోని విడుదల దేవాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంలోని సెక్యులర్ అనే పదం తొలగించి మన దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించడానికి కుట్రలు సాగిస్తుందన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు సెక్యులర్ వాదులంతా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత ఐక్య సమేత జాతీయ అధ్యక్షులు డాక్టర్ దొమ్మిటరాజ సతీష్, వైఎంసిఏ ప్రెసిడెంట్ కోలమూరి ప్రభాకర్, వైసిపి క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, రీజనల్ చైర్మన్ జెపిసి అధ్యక్షులు ఐజాక్, తదితరులు మాట్లాడారు. ఫిబ్రవరి 10న మెక్లారిన్ గ్రౌండ్‌లో జరిగే మహాసభకు ప్రతి ఒక్కరు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య సమైక్య నేషనల్ ప్రెసిడెంట్ దొమ్మేటి రాజా సతీష్, జిల్లా అధ్యక్షులు సాదే నరేంద్ర, దళిత ఐక్యసమైక్య నాయకులు అడ్వకేట్ మడికి బాబ్జి, అడ్వకేట్ బత్తుల రవి, వేముల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని తరిమికొడదాం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మతోన్మాదం బిజెపిని తరిమికొట్టడం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని రాష్ట్ర కిసాన్ సెల్ కో-ఆర్డినేటర్ ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. ఈ మేరకు కాకినాడలో జరిగే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరయ్యే నాయకులు, కార్యకర్తల వాహనాలను ప్రతిపాడులో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను, రాష్ట్ర బిసి సెల్ కో-ఆర్డినేటర్ కొల్లు వీరగణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన వెంకటేశ్వరరావు, ఎనుముల రాజా, దడాల చంటి, తేజోమూర్తుల ఉషారాణి, గుర్రం విష్ణు, దొంతం శెట్టి చంద్రశేఖర్, పోతబత్తులు పెదబాబు, పలివెల మల్లేశ్వరరావు, దాడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


నూతన ఓటర్లను సత్కరించిన ఓటు నమోదు అధికారులు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని విద్యార్థులు, బిఎల్ఒలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య విశిష్టతను పెంచాలని ఉద్దేశంతో ప్రతి ఏట కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందాలన్నారు. కొత్త ఓటర్లను పరిపాలన అధికారి సత్కరించారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ఎస్‌టిపి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేష్, బేతాళం కుమార్, బచ్చుల సాగర్, సాధనాల బాబు, నోడల్ అధికారులు, బూత్ లెవెల్ సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడామైదానంలో శుక్రవారం పరిపాలనాధికారి మునిస్వామి జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు. కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జాతీయస్థాయి పోటీలకు గొల్లపాలెం విద్యార్థిని

ప్రజాశక్తి - కాజులూరు

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు గొల్లపాలెం జడ్‌పి పాఠశాల విద్యార్థిని పలివెల అక్షయ ప్రియ ఎంపికైందని పాఠశాల హెచ్ఎం సుశీలమణి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకూ చత్తీష్‌గడ్ రాష్ట్రంలోని కోర్బాలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే అండర్ 14 విభాగంలో అక్షయ ప్రియ పాల్గొంటుందని చెప్పారు.